సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలి



అధికారులకు ఆస్తిపన్ను చెక్కు అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యాలయ ప్రతినిధులు

అబిడ్స్‌: అబిడ్స్‌ జీహెచ్‌ఎంసీ–14వ సర్కిల్‌ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లు జోరుగా కొనసాగుతోంది. డిప్యూటీ మున్సిపల్‌ కమిషనర్‌ డి.లావణ్య ఆధ్వర్యంలో ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్‌ కైలాష్‌ సింగ్‌, బిల్‌ కలెక్టర్‌ మధు అబిడ్స్‌ కట్టెల మండిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయ ఆస్తిపన్నును స్వీకరించారు. సోమవారం బీజేపీ కార్యాలయ ప్రతినిధులు ఆస్తిపన్ను చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సకాలంలో ఆస్తిపన్ను అందరూ చెల్లించాలని పేర్కొన్నారు.

ఆలయ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎన్‌ఆర్‌.లక్ష్మణ్‌రావు

అఫ్జల్‌గంజ్‌: బేగంబజార్‌ ఫీల్‌ఖానాలోని ఆలయ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బజరంగ్‌ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌.ఆర్‌.లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టికి ఆయన ఫిర్యాదు చేశారు.

బీఆర్‌ఎస్‌ హయాంలోనే గోషామహల్‌ అభివృద్ధి



ఎమ్మెల్సీ కవితను కలిసిన పప్పు మాత్రే, ఆనంద్‌సింగ్‌ తదితరులు

అబిడ్స్‌: బీఆర్‌ఎస్‌ హయాంలోనే గోషామహల్‌ నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం గోషామహల్‌ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు పప్పుమాత్రే, ఆనంద్‌ సింగ్‌, ధినేష్‌ సింగ్‌, శ్రీనివాస్‌ తదితరులు ఆమెను కలిసి పలు సమస్యలపై మెమోరాండం అందజేశారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. గోషామహల్‌ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌ హయాంలో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజల కోసం బీఆర్‌ఎస్‌ పార్టీ ముందుంటుందని పేర్కొన్నారు.

ప్రైవేట్‌ ట్యాంకర్ల దోపిడీ

గోల్కొండ: వేసవి ప్రతాపం ఇంకా మొదలు కాకముందే ప్రైవేటు ట్యాంకర్ల నిర్వాహకులు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. భూగర్భ జలాలు అప్పుడే అడుగంటడం, జలమండలి నీటి ట్యాంకర్లు కూడా అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు ప్రైవేటు నీటి ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని ప్రైవేటు నీటి ట్యాంకర్ల వారు ట్యాంకర్‌ ధరలను ఎడాపెడ పెంచేశారు. ట్యాంకర్‌ నీళ్లల్లో నాణ్యత ఉండడం లేదని పది వేల నీటి సామర్థ్యం గల ట్యాంకర్‌లో కేవలం తమకు 8 వేల లీటర్లు మాత్రమే వస్తున్నాయని పలువురు అంటున్నారు. ఐదువేల్ల సామర్థ్యం గల నీటి ట్యాంకర్‌కు వెయ్యి లీటర్లు తక్కువ వస్తున్నాయని కొందరు రెస్టారెంట్ల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా మెహిదీపట్నం, గుడిమల్కాపూర్‌, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో ప్రైవేటు నీటి ట్యాంకర్ల వ్యాపారం జోరుగా కొనసాగుతోంది.

'అన్ని జిల్లాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేస్తాం'



మహ్మద్‌ ఇస్మాయిల్‌కు సభ్యత్వ పత్రాన్ని అందజేస్తున్న మహ్మద్‌ నజీబ్‌

గోల్కొండ: తెలంగాణలోని అన్ని జిల్లాల్లో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్‌ ఆర్గనైజేషన్‌ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని ఆర్గనైజేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్‌ నజీబ్‌ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో మహ్మద్‌ ఇస్మాయిల్‌, నగ్మలకు టీఎఫ్‌సీవో సభ్యత్వ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..15 ఏళ్లుగా తమ ఆర్గనైజేషన్‌ కేవలం హైదరాబాద్‌, మెదక్‌, సంగారెడ్డి జిల్లాలకే పరిమితమైందన్నారు. ఇక్కడ ఎన్నో కుటుంబ తగాదాలను, దంపతుల వివాదాలను పరిష్కరించామన్నారు.

నీటి ఎద్దడి..ముందస్తు చర్యలేవీ..?

- గౌలిపురాలో నిరుపయోగంగా సింథటిక్‌ వాటర్‌ ట్యాంక్‌లు
- కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా తొలగించిన వైనం
- వేసవి నేపథ్యంలో అందుబాటులోకి తేవాలని కోరుతున్న ప్రజలు



అయోధ్యానగర్‌ జ్ఞాన భారతి స్కూల్‌ సమీపంలో..



గౌలిపురా సీబీఐ క్వార్టర్స్‌లో నిరుపయోగంగా సింథటిక్‌ వాటర్‌ ట్యాంక్‌లు

గౌలిపురా: వేసవికి ముందే గౌలిపురా డివిజన్‌లోని పటేల్‌నగర్‌, అంబికానగర్‌, హనుమాన్‌నగర్‌, అయోధ్యానగర్‌, ఎస్సార్టీ కాలనీ, అచ్చయ్యనగర్‌లలో నీటి ఎద్దడి నెలకొంది. వేసవి రాక ముందే భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో గతంలో ఏర్పాటు చేసిన సింథటిక్‌ వాటర్‌ ట్యాంక్‌లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాల్సిన అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేయడం లేదని బస్తీవాసులు వాపోతున్నారు. ఎండాకాలం నీటి సమస్య తలెత్తకుండా గతంలో సింథటిక్‌ వాటర్‌ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. ఆ నీటితో బస్తీవాసుల ఇబ్బందులు గట్టెక్కేవి. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సింథటిక్‌ వాటర్‌ట్యాంక్‌లు నేడు దిష్టి బొమ్మలుగా మిగిలిపోయాయి. ఈ ఏడాది వందేళ్ల నాటి ఎండలు నమోదవుతాయన్న వార్తల నేపథ్యంలో అధికారులు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అంబికానగర్‌లో..



పని చేయని పవర్‌ బోర్‌

నిరుపయోగంగా..

గతంలో అధికారులు వేసవికాలం బస్తీల్లో సింథటిక్‌ వాటర్‌ ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. క్రమేణా వీటి నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అయితే కనీస అవసరాలకు బోర్‌ నీరు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిరుపయోగంగా మారిన సింథటిక్‌ వాటర్‌ ట్యాంక్‌ల చుట్టూ స్థానిక ప్రజలు చెత్త వేస్తుండడంతో ఆ ప్రాంతం మొత్తం అపరిశుభ్రంగా తయారయ్యింది. కొన్ని ప్రాంతాల్లో సింథటిక్‌ వాటర్‌ ట్యాంక్‌లు పూర్తిగా కనుమరుగయ్యాయి. ఎండాకాలం నేపథ్యంలో శిథిలావస్థకు చేరుకున్న సింథటిక్‌ వాటర్‌ట్యాంక్‌లకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి..



గతంలో ఇంట్లో ఇతర అవసరాలకు బోర్‌ నీటిని వినియోగించే వాళ్లం. ప్రస్తుతం సింథటిక్‌ వాటర్‌ ట్యాంక్‌లు అందుబాటులో లేకపోవడంతో నీటి కోసం ఇబ్బందిపడుతున్నాం. ఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు బస్తీల్లో సింథటిక్‌ వాటర్‌ ట్యాంక్‌లను అందుబాటులోకి తీసుకురావాలి.

– గురుదత్‌, సీబీఐ క్వార్టర్స్‌, గౌలిపురా

నాంపల్లి కోర్టు బార్‌ అసోసియేషన్‌ రెన్నోవేషన్‌ పూర్తి



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్‌రెడ్డి

సిటీ కోర్టులు: నాంపల్లి క్రిమినల్‌ కోర్టు బార్‌ అసోసియేషన్‌, సీనియర్‌ బార్‌ అసోసియేషన్‌ను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌ విజయసేన్‌రెడ్డి, జస్టిస్‌ పుల్ల కార్తిక్‌ సోమ వారం ప్రారంభించారు. నాంపల్లి క్రిమినల్‌ కోర్టు ఆధ్వర్యంలో చేపట్టిన బార్‌ అసోసియేషన్‌, సీనియర్‌ బార్‌ అసోసియేషన్‌కు రెన్నోవేషన్‌ పూర్తి చేశారు. ఈ సందర్భంగా నాంపల్లి కోర్టు బార్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ రాజవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి కోర్టు మెట్రోపాలిటన్‌ సెషన్స్‌ జడ్జి బి.సురేశ్‌, ప్రిన్సిపల్‌ సీబీఐ స్పెషన్‌ కోర్టు జడ్జి టి.రఘురాంతో పాటు ఇతర జడ్జీలు, బార్‌ అసోసియేషన్‌ జనరల్‌ సెక్రటరీ సీవీ శ్రీనాథ్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ గోకుల్‌, రామంజనేయులు, జాయింట్‌ సెక్రటరీ రమేశ్‌, కమిటీ సభ్యులు ఈశ్వర్‌ కుమార్‌, శివకుమార్‌, మాధవి, కుమార్‌, శ్రీకిషన్‌, ధయాకర్‌, రాజాగోపాల్‌ పాల్గొన్నారు.

కచ్చామోరీ సమస్యను పరిష్కరించండి



జీహెచ్‌ఎంసీ ఏఈకి సమస్యను చూపిస్తున్న చిరంజీవి

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి ఆలయం వద్ద నెలకొన్న కచ్చామోరీ సమస్యతో భక్తులు, బాటసారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని బీజేపీ భాగ్యనగర్‌ జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి అన్నారు. స్థానికులతో కలిసి సోమవారం ఆయన జీహెచ్‌ఎంసీ ఏఈ చిట్టిబాబును అక్కడికి పిలిపించి సమస్యను చూపించారు. గత బోనాల నుంచి నెలకొన్న ఈ సమస్యతో ఉప్పుగూడ మహంకాళి ఆలయం, కాళికామాత ఆలయాలకు వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..స్థానికంగా పాఠశాలలు కూడా ఉండడంతో విద్యార్థులు నడుచుకుంటూ వెళుతుంటే వాహనాలు మురుగులో నుంచే వెళ్లే క్రమంతా నీరంతా విద్యార్థులపై పడుతుందన్నారు. ఈ విషయమై జోనల్‌ కమిషనర్‌ దృష్టికి తీసుకెళితే కింది స్థాయి అధికారుల పైకి నెడుతున్నారని, వీరిని అడిగితే జోనల్‌ కమిషనర్‌ దగ్గర ఫైల్‌ పెండింగ్‌లో ఉందని కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే స్పందించి శివసాయినగర్‌ సరిహద్దు నుంచి మహంకాళి ఆలయం వరకు కచ్చామోరీ నిర్మించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మామిడి కృష్ణ, కోవూరి శివక్రాంత్‌, గుడిపల్లి రాజా, నిరంజన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్‌ యూనియన్‌



సత్కరిస్తున్న కేఆర్‌ రాజ్‌కుమార్‌ తదితరులు

అబిడ్స్‌: ఉద్యోగులకు అండగా ఉండి టీఎన్జీఓస్‌ యూనియన్‌ అహర్నిశలు కృషి చేస్తుందని టీఎన్జీఓస్‌ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌, ప్రధాన కార్యదర్శి డాక్ట్‌ ఎస్‌ఎం.ముజీబ్‌ హుస్సేనీ పేర్కొన్నారు. హైదరాబాద్‌ కలెక్టర్‌ ద్వారా పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన మారం జగదీశ్వర్‌, ఎస్‌ఎం.ముజీబ్‌ హుస్సేనీలను టీఎన్జీఓస్‌ యూనియన్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ అధ్యక్షుడు కేఆర్‌.రాజ్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్‌, ఎస్‌ఎం.ముజీబ్‌ హుస్సేనీ మాట్లాడతూ.. ఉద్యోగులకు, సిబ్బందికి అండగా ఉండి వారి శ్రేయస్సు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌, చంద్రశేఖర్‌రెడ్డి, అమీర్‌, మాధురి, రాకేష్‌, పరమేష్‌, దామోధర్‌, మధు తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం



అంతర్జాతీయ నృత్య దర్శకురాలు శ్రావణికి పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ శాంతికృష్ణ సేవా సమితి 40వ వార్షికోత్సవాన్ని సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయవాది ఎ.పద్మచారి మాట్లాడుతూ..వరంగల్‌ జిల్లాలో 40 ఏళ్ల క్రితం బతుకమ్మ తల్లి జన్మస్థలమైన చౌటుపల్లి గ్రామంలో స్థాపించబడిన ఈ సంస్థ 4 దశాబ్దాల వేడుకలను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసేందుకు సంస్థ చేసిన కృషిని కొనియాడారు. అనంతరం వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పల్లెప్రకృతి సేవా దృక్పథులు డాక్టర్‌ వరప్రసాద్‌, ఏసీపీ డాక్టర్‌ కిరణ్‌కుమార్‌, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, వైద్య నిపుణులు ఆనందయ్య, సంస్థ వ్యవస్థాపకులు శాంతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించాలి



జోనల్‌ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: కార్వాన్‌ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కౌసర్‌ మొహియుద్దీన్‌ కోరారు. సోమవారం ఖైరతాబాద్‌ జోన్‌ జనల్‌ కమిషనర్‌ అనురాగ్‌ జయంతిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్‌ నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు, అభివృద్ధి పనులకు ఇచ్చిన ప్రతిపాదనలు, తదితర విషయాలపై చర్చించారు. నియోజకవర్గంలో ఎన్నో పనులు నత్తనడకన సాగుతున్నాయని దీన్ని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధాన రహదారులను అభివృద్ధి పనుల కోసం తవ్వి అలాగే వదిలేస్తున్నారని కొంత కాలం తర్వాత మళ్లీ ఆ పనులు మొదలు అవుతున్నాయన్నారు. టోలిచౌకి చౌరస్తా, గోల్కొండ, ఎండి లైన్స్‌, కార్వాన్‌, లంగర్‌హౌస్‌ తదితర డివిజన్‌లలో ఎన్నో పనులు మధ్యలోనే ఆగిపోయాయని ఆయన అన్నారు. స్వయంగా నియోజకవర్గంలో ఒకసారి పర్యటించి ఆగిపోయిన పనులను చూసి సరైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఒత్తిడి వల్లే మెదడు సంబంధిత వ్యాధులు



ఆలివ్‌ ఆస్పత్రిలో పోలీసులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

లంగర్‌హౌస్‌: ఒత్తిడికి లోనవ్వడంతోనే బ్రెయిన్‌ స్ట్రోక్‌, మెదడు వాపు వ్యాధులు వస్తాయని ఆలీవ్‌ ఆస్పత్రి వైద్యులు అన్నారు. మెదడు సంబంధిత వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయమై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 70 మంది పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ..ఎక్కువ శాతం పని ఒత్తిడి, తీవ్ర ఆలోచనలతో మెదడుపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందన్నారు. దీంతో బ్రెయిన్‌ స్ట్రోక్‌లు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. తల నొప్పి, ఛాతి నొప్పి, భుజాల నొప్పి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం తీసుకోవాలన్నారు. అజాగ్రత్త వీడాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్‌ రఘుకుమార్‌, ఎస్సైలు రాజు, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

నేడు దర్శకుడు వంశీ చలనచిత్ర జీవిత స్వర్ణోత్సవ వేడుకలు

గన్‌ఫౌండ్రీ: వంశీ ఆర్ట్‌ థియేటర్స్‌, శారద ఆకునూరి (అమెరికా)ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4న రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత, దర్శకుడు వంశీ ఐదు దశాబ్దాల చలనచిత్ర జీవిత స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీనటుడు రాజేంద్రప్రసాద్‌, దర్శకుడు రేలంగి నర్సింహారావు, నిర్మాత ఏడిద రాజతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. దర్శకుడు వంశీని ఘనంగా సత్కరించడంతో పాటు సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జోనల్‌ కమిషనర్‌కు సన్మానం



చాంద్రాయణగుట్ట: చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సహకరించినందకు కమిటీ చైర్మన్‌ ఎ.మహేష్‌గౌడ్‌ సోమవారం జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోన్‌ జోనల్‌ కమిషనర్‌ వెంకన్నను సన్మానించారు. ఆయన కార్యాలయంలో కలిసి శాలువా కప్పి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌గౌడ్‌ మాట్లాడుతూ.. ఆలయ మెట్ల అభివృద్ధికి రూ.7 లక్షలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు.

ఇఫ్తార్‌ విందులో ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌ ఒవైసీ



చాంద్రాయణగుట్ట: పవిత్ర రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకొని ఉప్పుగూడ డివిజన్‌ కార్పొరేటర్‌ ఫహద్‌ బిన్‌ అబ్దాద్‌ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందులో మజ్లిస్‌ పార్టీ శాసనసభ పక్షనేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌ ఒవైసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేటర్‌తో పాటు మాజీ కార్పొరేటర్‌ సమద్‌ బిన్‌ అబ్దాద్‌లకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. రంజాన్‌ మాసంలో ప్రతి ఒక్కరూ నియమ నిష్ఠలను పాటించాలని సూచించారు. లలితాబాగ్‌ కార్పొరేటర్‌ ఆజం షరీఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మణికొండ: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా అద్దంకి చెందిన శ్రీనివాస్‌(30) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి నార్సింగిలో నివసిస్తున్నాడు. మణికొండలోని మౌంట్‌ లిటేరా జీ స్కూల్‌లో పనిచేస్తున్న అతడు ఆదివారం రాత్రి తన ఇంటికి సమీపంలోని కిరాణా షాపునకు వెళ్లి వస్తున్న క్రమంలో వివేకానందనగర్‌ కాలనీలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దాంతో శ్రీనివాస్‌ కింద పడిపోయాడు. 108కు సమాచారం ఇవ్వగా వారు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

'ప్రజావాణి'లో ఐదు ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్‌ కమిషనర్‌ వెంకన్న

చార్మినార్‌: ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోనల్‌ కమిషనర్‌ వెంకన్న సూచించారు. సోమవారం జోనల్‌ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట, సంతోష్‌నగర్‌, చార్మినార్‌ సర్కిల పరిధిలోని అక్రమ నిర్మాణాలపై 3, ఇంజినీరింగ్‌ సమస్యలపై 2.. కలిపి మొత్తం 5 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్‌ కమిషనర్‌ వెంకన్న మాట్లాడుతూ..ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని తక్షణమే పరిష్కరిస్తున్నమన్నారు. ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్‌ డిప్యూటీ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌ ప్లానింగ్‌ సిటీ ప్లానర్‌ మహమ్మద్‌ అబ్దుల్‌ మాజీద్‌, ఎలక్ట్రికల్‌ ఈఈ రామారావు, బిల్‌ కలెక్టర్‌ రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పురోగతిపై చర్చ

యాకుత్‌పురా: నియోజకవర్గంలో ప్రతిపాదించిన అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపై ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌ సోమవారం రాష్ట్ర మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ అండ్‌ పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్‌ను తన కార్యాలయంలో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శిథిలావస్థకు చేరుకున్న పురాతన డ్రైనేజీ పైప్‌లైన్‌, నాలాలా విస్తరణ అభివృద్ధి పనులను చేపట్టాసున్నమన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రతిపాదించి కొనసాగుతున్న.. చేపట్టానున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించి పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు ప్రతిపాదించిన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని కోరమన్నారు.



దీపక్‌ శర్మకు డాక్టరేట్‌



సుల్తాన్‌బజార్‌: ప్రముఖ సంఘ సేవకుడు, హ్యూమన్‌రైట్స్‌ యాక్టివిస్ట్‌ డాక్టర్‌ దీపక్‌ శర్మకు న్యూఢిల్లీకి చెందిన ఐకానిక్‌ పీస్‌ అవార్డు కౌన్సిల్‌ ఆధ్వర్యంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రల్లో 15 ఏళ్లుగా దీపక్‌ శర్మ తన సొంత నిధుల ద్వారా సమాజంలో పేదవారికి ఇతర అణగారిన వర్గాలకు ఎంతో మేలు చేశారు. ఆయన సేవలను గుర్తించిన సంస్థ ఆయనకు డాక్టరేట్‌ ప్రదానం చేయడంపై పలువురు సంఘ సేవకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దీపక్‌ శర్మ మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా సమాజానికి తన వంతుగా తనకు సహాయ సహకారాలు అందించానని తెలిపారు. అలాగే పేదలకు న్యాయపరమైన సహాయం చేస్తున్నామని తెలిపారు. తనకు ఈ అవార్డును అందించిన ఐకానిక్‌ పీస్‌ అవార్డు కౌన్సిల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాములోరు వచ్చినాడు.. | హనుమంత వాహనంపై..

వేడుకగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ టీటీడీ శ్రీవేంకటేశ్వరస్వామి 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామివారు సోమవారం ఉదయం హనుమంత వాహనంపై రాములవారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. హనుమంత వాహనంపై వచ్చిన శ్రీవారిని చూసిన భక్తులు పులకించిపోయారు. హనుమంతుడు భగవత్‌ భక్తులలో అగ్రగణ్యుడని గురు శిష్యులైన శ్రీరామ హనుమంతుల తత్వవివేచన తెలిసిన మహనీయులు కాబట్టి ఈ ఇరువురిని ఒకేసారి చూసిన భక్తులకు వేదాల తత్వం ఒనగూరుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం ఆలయంలో నిర్వహించిన రథ రంగ డోలోత్సవం కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.



జూబ్లీహిల్స్‌ టీటీడీ శ్రీవారి ఆలయంలో..

నేటి నుంచి 'ఫెడరేషన్‌' నామినేషన్లు

మణికొండ: ఆల్‌ కాలనీస్‌ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఫెడరేషన్‌ మణికొండ మున్సిపాలిటీ నూతన కార్యవర్గ ఎన్నికలకు మంగళవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి జరిగే ఎన్నికల్లో భాగంగా ఈ నెల 9వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 4, 5 తేదీల్లో నామినేషన్ల దాఖలు, 6వ తేదీన ఉపసంహరణ, 7వ తేదీన ఫైనల్‌ లిస్టు ఉంటుందని ఎన్నికల అధికారులు ఎం.సత్యానారాయణ మూర్తి, బీవీ సత్యనారాయణ తెలిపారు. నామినేషన్లను ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు సాయిరాంనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో అందజేయాలని వారు వివరించారు.